క్లుప్తంగా

మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన సభ్యులు



ఐనవోలు: పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులను హనుమకొండలో వేర్వేరుగా నూతన శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ట్రస్టు బోర్డు కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియామకానికి సహకరించినందుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా, మంగళవారం ట్రస్టుబోర్డు కమిటీ ఉత్తర్వులు వెలువడగా 14మంది సభ్యులు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో కలిపి గురువారం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో పాటు ముఖ్య నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు వివేకానంద జయంతి

ఆత్మకూరు: నేడు మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

ఎన్నిక



ఆర్యరాజు, అధ్యక్షుడు

ఎల్కతుర్తి: తెలంగాణ అంబేద్కర్ సంఘం నూతన మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అంబాల ఆర్యరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబాల ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్యరాజు మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ఈ పదవీబాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

శబరిమలకు మాలధారులు

శాయంపేట: అయ్యప్ప దీక్షలు ముగిసిన పలువురు మాలధారులు బుధవారం మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయంలో గురుస్వామి కందగట్ల రమేష్ ఆధ్వర్యంలో ఇరుముడిని కట్టుకున్నారు. ఉదయం స్వామివారికి పూజలు చేసి శబరిమలకు బయలుదేరారు. శబరిమలకు తరలిన వారిలో బాపురావు, దేశపతి, కుమారస్వామి, శివ, మారుతి, బాసాని బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

దామెర: మండలంలోని ల్యాదెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎస్ఎంసీ చైర్మన్ కాలసాని సాంబయ్య రూ. 10వేలు విలువ చేసే క్రీడాపరికరాలు బహూకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, అశోక్, కుక్క అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్..

నడికూడ: మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు పసుల రామకృష్ణ తనకు వీల్‌చైర్ అందివ్వాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. బుధవారం సర్పంచ్ బొట్ల సంధ్యరవి ఎమ్మెల్యే ఆదేశాలతో వీల్‌చైర్ అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణ కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరుణ, కారోబార్ స్వామి, ఉపసర్పంచ్ బెజ్జంకి రఘునాచారి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ

భీమదేవరపల్లి: మండలంలోని ముల్కనూర్ స్వామి రామానంద తీర్థ సహకార జూనియర్ కళాశాలలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంక్రాంతి ముగ్గులు వేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎదులాపురం మొగిలి, అధ్యాపకులు హరికృష్ణ, రాంబాబు, గణేష్, శ్రీనివాస్, సుమన్, రమణాచారి, లింగారెడ్డి, కిరణ్, మహిమ జ్యోతి, ప్రియాంక, సిరి, చందన తదితరులు ఉన్నారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

ఐనవోలు: ఐలోని శ్రీమల్లికార్జునస్వామి జాతర సందర్భంగా 14,15,16 తేదీలలో ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ శిబిరంలో కీళ్ల నొప్పులు, దగ్గు, జలుబు, ఎలర్జీ, మెడ, నడుము నొప్పిలాంటి సమస్యలకు వైద్యం చేస్తామని తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అసోసియేట్ జాయింట్ సెక్రటరి డాక్టర్ బాసాని శ్రీకాంత్, ట్రెజరర్ డాక్టర్ వివి రెడ్డి, డాక్టర్ పీ కమల కిషోర్ పాల్గొన్నారు.

ఇంకా ఎన్నేళ్లకు కడతారు?

- ప్రగతిసింగారం 'డబుల్' శంకుస్థాపనకు రెండేళ్లు
- నిర్మాణాలకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- హామీలన్నీ శిలాఫలకానికే పరిమితం
- పేదలకు తప్పని ఎదురుచూపు

శాయంపేట: మండలంలోని ప్రగతి సింగారంలో డబుల్ బెడ్రూం ఇళ్లకు శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవ సమయంలో నాయకులు ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే తామే స్వయంగా ఇంజనీర్లను తీసుకొచ్చి మరీ డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి, పేదలకు అందిస్తామని ఉపన్యాసాలు ఇచ్చారని కానీ ఇప్పటి వరకూ కనీసం ఒక్క ఇటుకు కూడా వేయలేదని స్థానికులు, నాయకులు చెబుతున్నారు. దీంతో సామాన్యుల సొంతింటి కలలు క్రమంగా కరిగిపోతున్నాయి.

55 ఇళ్ల నిర్మాణానికి రూ. 27.70 లక్షలు

ప్రభుత్వం ప్రగతిసింగారం గ్రామానికి 55 ఇళ్లు మంజూరు చేసింది. దీంతో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి 2021 జనవరి 6న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి శంకుస్థాపన చేశారు. ఇళ్ల నిర్మాణానికి రూ. 27.70 లక్షల నిధులు కేటాయించినప్పటికీ అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఎదురుచూపు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని ప్రగతి సింగారం గ్రామ లబ్ధిదారులు కోరుతున్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం కేటాయించిన స్థలం



ఇళ్ల నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

గుడిసెలో బతుకుతున్నాం

పూరి గుడిసెలో బతుకుతున్నాం. కేసీఆర్ ఇస్తామన్న డబుల్ బెడ్రూం కల ఎప్పుడు నెరవేరుతుందో తెలియడంలేదు. గండ్ర దంపతులు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్న పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ఇళ్ల నిర్మాణం చేపట్టి సొంతింటి కల నెరవేర్చాలి.

– బల్ల సాంబయ్య, ప్రగతి సింగారం

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

మాగ్రామానికి 55డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు అయ్యాయి. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణం కోసం చేపట్టి శంకుస్థాపన వరకే పరిమితమైంది. ఇప్పటికైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పంపిణీ చేయాలి.

– గోగుల రాజిరెడ్డి, ప్రగతిసింగారం

సొసైటీలకు రూ.10 లక్షల రుణాలు ఇవ్వాలి

ధర్మసాగర్(వేలేరు): మత్స్యసొసైటీకి రూ. 10 లక్షల ఉచిత రుణాలు ఇవ్వాలని మత్స్యకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ డిమాండ్ చేశారు. వేలేరు మండల కేంద్రంలో బుధవారం మత్స్యకార్మిక సంఘం మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికై 2023 బడ్జెట్‌లో రూ. 5 వేలకోట్లు కేటాయించాలన్నారు. జనవరి 30న ఉదయం 11 గంటలకు హనుమకొండలోని ఆర్ట్స్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించే జిల్లా సదస్సుకు మత్స్యకారులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా సదస్సు కరపత్రం ఆవిష్కరించారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి గుండు సాంబరాజు, ఇట్టబోయిన సంపత్, దండవేణి కుమారస్వామి, రేగుల నాగరాజు, యాటపోతు సంపత్, ముప్పారపు సాంబరాజు, ఇట్టబోయిన భూపతిరాజు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

పరకాల: పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు చేపట్టగా రూ.1,44,197 ఆదాయం వచ్చినట్లు ఈఓ కె.వెంకటయ్య వెల్లడించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ, ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తాం

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



చలివాగులో నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

శాయంపేట: రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం జోగంపల్లి శివారు చలివాగు ప్రాజెక్టు నుంచి యాసంగి పంటల సాగుకు జెడ్పీ వైస్‌చైర్మన్ గండ్ర జ్యోతితో కలిసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాగు, సాగునీటికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ఈఏడాదిలో ఆయకట్టు కింద రెండో పంట కోసం 1300 ఎకరాలకు తైబందీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన చలివాగు ప్రాజెక్టు ఆధునీకరణ కోసం రూ. 10.21కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలో సీఎం అనుమతులు రాగానే టెండర్ పిలుస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ దేవాదుల సమ్మక్క బ్యారేజీ కట్టడం ద్వారా పంటలకు నీరు అందుతోందన్నారు. రైతులకు ఉచితంగా కరెంట్‌తోపాటు రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో ప్రభుత్వం అండగా అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గోలి మహేందర్‌రెడ్డి, రేణికుంట్ల సదయ్య, దైనంపల్లి సుమన్, గడిపె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన ఎమ్మెల్యే..

మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన దేవులక్ష్మి అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సుకినె కిరణ్‌కు డాక్టరేట్ ప్రదానం



దామెర: మండల కేంద్రానికి చెందిన సుకినె కిరణ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిరణ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 'ద ఇంపార్టెంట్ ఆఫ్ టెలివిజన్ అడ్వర్టైజ్‌మెంట్ ఆన్ కన్‌సంప్షన్ ఆఫ్ ఎఫ్.ఎం.సీ.జీ ఇన్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథం ప్రచురించారు. దీనికి గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు కిరణ్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరిశోధన ఓ.యూ ప్రొఫెసర్ వి.శేఖర్ పర్యవేక్షణలో నిర్వహించినట్లు కిరణ్ తెలిపారు. ఈయన ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్లేస్‌మెంట్ సెల్‌లో కో–ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డు పొందిన అనంతరం కిరణ్ మాట్లాడుతూ ఉల్లిగడ్డ దామెర నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు ఎదిగేందుకు సహకరించిన కుటుంబ సభ్యులు పెద్దన్న, రవి, రాణికి కృతజ్ఞతలు తెలిపారు. తన పర్యవేక్షణలో డాక్టరేట్ పూర్తిచేసేందుకు అవకాశం కల్పించిన ప్రొ. శేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి రాజయ్య

ధర్మసాగర్(వేలేరు): రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. వేలేరు మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం కంటి వెలుగు ప్రోగ్రాంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో రెండో విడత కంటి వెలుగును విజయవంతం చేయాలని అన్నారు. రేషన్‌షాపులు గ్రామ పంచాయతీలు, గ్రామ ప్రధాన కూడలిలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకు వచ్చారని అన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో కూడా ఇంత పెద్ద కంటి పరీక్షల కార్యక్రమాన్ని ఇప్పటి వరకు నిర్వహించలేదని, కేవలం తెలంగాణలో మాత్రమే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రెండో విడత కంటి వెలుగు ప్రోగ్రాం నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అధికారులు సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు తయారు చేసుకొని క్యాంపుల నిర్వహణపై పకడ్బందీ కార్యాచరణ చేసుకోవాలని సూచించారు. స్టేట్ లెవెల్‌లో 10 క్వాలిటీ కంట్రోల్ టీమ్‌లు, జిల్లాల్లో ఒక్కో క్వాలిటీ కంట్రోల్ టీమ్ ఉండి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు ప్రభావవంతంగా జరుగుతున్నాయా లేదా అని సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తారని చెప్పారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా వ్యవహరిస్తూ పనిచేయాలని సూచించారు. సామాజిక బాధ్యతతో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, పార్టీ శ్రేణులు రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, డిప్యూటి డీఎంహెచ్ఓ యాకుబ్ పాషా, తహసీల్దార్ సమ్మయ్య, ఆనంద్‌కుమార్, డాక్టర్ గీతారాణి, వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు: గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే చల్లా. ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, ఎఎంసీ చైర్మన్ పర్సన్ బొల్లబోయిన రాధా, పెద్దాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, సర్పంచులు సావురే కమల, జిల్లెల రాజేశ్వరి, మాదాసి రజిత, అర్షం బలరాం, రైతుబంధు సమితి కో ఆర్డినేట్ రాయరాకుల రవీందర్, ఆత్మకూరు ఎఎంసీ డైరెక్టర్లు కాకాని శ్రీధర్, గోనే రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

నడికూడ: గతేడాది కురిసిన వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతుదీక్ష చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎకరానికి సుమారు రూ.8 లక్షలు వరకు పెట్టుబడి పెట్టారని, కనీసం ఎకరానికి రూ. లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్‌కు పంజాబ్ రైతులపై ఉన్న ప్రేమ, తెలంగాణ రైతులపై లేదా అని ప్రశ్నించారు. రైతుల పక్షాన బీజేపీ నిరంతరం కొట్లాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగురి భిక్షపతి, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయచందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, జయంతి లాల్, డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడికి వెళ్లాలి



బడిలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దామెర: బడి ఈడు పిల్లలు బయట ఉండకుండా, బడికి వెళ్లాలని సీఆర్పీ రాజు సూచించారు. మండల కేంద్రంలో బడి బయట ఉన్న పిల్లలపై బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీ రాజు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడి మానేయకుండా చదువును కొనసాగించాలని, ఇందుకు వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. వివిధ కారణాలతో 10వ తరగతి వరకు చదవకుండా మానేసిన విద్యార్థులు ఆత్మకూర్ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని కోరారు. ఇతర వివరాల కోసం 9966580891 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: బడి ఈడు పిల్లలతో పాటు బడి మానేసిన పిల్లలందరిని బడిలో చేర్పించాలని ఎంఈఓ ఎర్ర రాంకిషన్‌రాజు సూచించారు. కమలాపూర్ మండలంలోని గూడూరు ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి బుధవారం బడి బయట ఉన్న పిల్లల సర్వే (ఓఎస్‌సీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను తప్పనిసరిగా బడికి పంపాలని కోరారు. సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో 6 నుంచి 14, 15 నుంచి 19 ఏళ్ల వయసు గల బడి బయట ఉన్న పిల్లలు, ఇప్పటి వరకు బడిలో నమోదు కాని, బడికి రాని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. గూడూరులోని ఇటుక బట్టీలో పని చేయడానికి చత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలు ఐదుగురిని గుర్తించి గూడూరు ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శివప్రసాద్, పాఠశాల హెచ్ఎం టి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సాయిప్రసాద్, శ్రీదేవి, విజయ, సీఆర్పీ సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు భూపోరాటం



శాయంపేట: మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

శాయంపేట: రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నేరవేర్చలేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకోడెపాక గ్రామ శివారులోని 632, 633 సర్వేనంబర్‌లో భూమిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు భూపోరాటం ఆగదని స్పష్టం చేశారు. కబ్జాదారులు ఆక్రమణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి ఆభూమికి హద్దులు ఏర్పాటుచేయాలన్నారు. సీఎం కేసీఆర్ అధికారాన్ని చేజిక్కించుకోని ఆతర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు బోట్ల చక్రపాణి, దొగ్గెల తిరుపతి, మంద సురేష్, చంద్రమౌళి, మంద నరేష్, చిలుకల కొమురయ్య, మాదాసు తిరుపతి, చిలువేరు శ్రీనివాస్, గువ్వ రేణుక, సురేందర్, నక్క రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి

పరకాల: ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల ప్రకారం ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణం చేయాలని ఎంసీపీఐ రాష్ట్ర నాయకుడు ఎన్‌రెడ్డి హంసరెడ్డి డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ పరకాల తహసీల్దార్ కార్యాలయం ముందు ఎంసీపీఐ కార్యకర్తలు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ రాష్ట్ర నాయకుడు హంసరెడ్డి మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు భూములు పంచాలని ఎంసీపీఐ ఎన్నో ఏళ్లుగా భూపోరాటాలు చేస్తోందన్నారు. ఎంసీపీఐ ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతిన.. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నీల రవీందర్, తక్కపల్లి బాబురావు, మహేశ్వరం రవీందర్, కుమారస్వామి, చిరంజీవి, రజిని, కోడెల ఎల్లేశం, మైసయ్య, రవి, రజిత, స్వరూప పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటు తరువాతే అభివృద్ధి

ఐనవోలు: తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాతే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు అన్నారు. బుధవారం మండలంలోని గర్మిళ్లపల్లి, నర్సింహులగూడెం గ్రామాల్లో సుమారు రూ.6.5 లక్షల జెడ్పీ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పల్లెప్రగతి పేర గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమ్మిళితంగా తెలంగాణ పురోగమిస్తుందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు గండి మల్లికాంబ, కట్కూరి సునీత, ఎంపీటీసీలు బీరం మౌనిక, పాలెపల్లి సరిత, బీరెడ్డి భాస్కర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శంకర్ రెడ్డి, అరుణ, సదానందం, బాబు, సురేందర్‌రెడ్డి, జీపీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

దామెర: మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య కల్యాణోత్సవ కార్యక్రమాలు సంప్రదాయరీతిన నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఎదురుకోళ్ల కార్యక్రమం కోలాహలంగా జరిపించిన అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి దంపతులు, భజనా మండలి సభ్యులు తలంబ్రాలు, పుస్తె, మట్టెలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. దీనికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాసాచార్యులు, గీతాచార్యులు, రంగాచార్యులు, వినయకుమారచార్యులు, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, ఉపసర్పంచ్ సాగర్, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు సునీల్, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

'మా స్కూల్ స్థలాన్ని మాకు ఇవ్వండి'

నడికూడ: మా స్కూల్ స్థలాన్ని మాకు ఇవ్వండని కోరుతూ బుధవారం మండల కేంద్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్ కలిసి ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కల్యాణ్ మాట్లాడుతూ మండలంగా నడికూడను ఏర్పాటు చేసినప్పుడు తాత్కాలికంగా ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటుకు ప్రాథమిక పాఠశాల భవనం తీసుకుని, ఇక్కడి పాఠశాలను హైస్కూల్‌లోకి మార్చారన్నారు. అక్కడ విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి తిరిగి ప్రాథమిక పాఠశాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న సర్పంచ్

ధర్మసాగర్(వేలేరు): ఈ నెల 11, 12, 13న నిర్మల్‌లో జరిగే తొమ్మిదవ సీనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మల్లికుదుర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని కే. శ్వేత ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థినిని అందుకు కృషి చేసిన పీఈటీ ఆలూరి సుమలతను సర్పంచ్ గోదల రాజిరెడ్డి, ఎంపీటీసీ బాల్నె వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. పోటీలో పాల్గొనే విద్యార్థినికి ఖర్చుల నిమిత్తం సర్పంచ్ ఆర్థిక సాయం అందజేశారు.